# 17. పోస్టల్ ఇన్‌ఫర్‌మేషన్

ఆ మధ్య మాకు మనవడు పుట్టేడు. మొదటి మనవడు కదా, అంచేత ఉత్సాహం పుట్టింది. పుత్రోత్సాహము పుత్రుడు జన్మించగానే పుట్టదు-అన్నాడు సుమతీ శతక కారుడు. కానీ పౌత్రోత్సాహం గురించి అలాంటి జనరలైజేషన్ ఏదీ ఉన్నట్టు లేదు. అందుకని మనవడు పుట్టడం వల్ల పుట్టిన ఉత్సాహానికి అడ్డుకట్ట లేకుండా పోయింది. బంధువులకీ, స్నేహితులకీ తెలియజేద్దాం అన్నాను; మా ఆవిడతో. "స్నేహితులకీ పత్రికల వాళ్లకీ ఎందుకు గానీ, బంధువులకి - అదీనీ చాలా దగ్గిర వాళ్లకి రాస్తే చాలు. పురుడుపట్టే వాళ్లు, వియ్యాలవారు; మా అన్నయ్యలు, అక్కయ్యలు-" అంది మా ఆవిడ. లెక్కవేసి చూశాం. మొత్తం పదహారు మంది తేలేరు. అందులో ఒక కుటుంబం వాళ్లు అమెరికాలో ఉన్నారు. వాళ్లు మా ఇంటి పేరు గల వాళ్లు; పైగా పురుడు పట్టే వాళ్లూనూ. కాని అమెరికాకి ఉత్తరం వెయ్యాలంటే కనీసం అయిదురూపాయలు ఖర్చుపెట్టాలనే సరికి మా ఆవిడ ఆలోచన మారిపోయింది. "వాళ్ళని వొదిలెయ్యండి. ఈ ఉత్తరం వాళ్లకి పదకొండు రోజుల్లో అందుతుందో లేదో! అందినా, వాళ్లు ఆ దేశంలో పురుడు పడ్తారో పట్టరో!" అంది. "ఉత్తరం అందడం విషయంలో ఆలస్యం ఉండదు. ఆ మాటకొస్తే నారాయణపురం ఆగ్రహారానికి వెళ్లే ఉత్తరం కంటే ముందే అమెరికా వెళిపోతుంది!" అన్నాను. ఐనా సరే. వాళ్లకి వొద్దని రూలవుట్ చేసేసింది ఆవిడ.

ఆ విధంగా పదిహేను మంది అయ్యారు. పదిహేను మందే కదా అని కార్డులు రాయడానికి సంకల్పించేను. "స్వస్తిశ్రీ చాంద్రమాన శుక్ల నామ సంవత్సర మాఘ శుద్ధ విదియా మంగళవారం అనగా 1989వ సంవత్సరం ఫిబ్రవరి నెల ఎనిమిదవ తేదీని మాకు ప్రథమ సుపౌత్ర జననం అయినది. మార్చి నెల ఎనిమిదవ తేదీ బారసాల చేస్తున్నాము. ఆనాటికి వచ్చి నాలుగు అక్షింతలు జల్లి వెళ్లమని కోరుతున్నాము" అని ఒక మోడల్ తయారు చేసి మా ఆవిడ చేత ఆప్రూవు చేయించుకుని, సన్యాసిరావుకి ఇచ్చాను; చక్కటి దస్తూరీతో రాస్తాడు కదా అని. రాత్రికి రాత్రి పదిహేను కార్డులు రాసేశాడు. అతి తెల్లటివి, దళసరివి, నున్నగా మెరిసిపోతున్నవి, సరిగ్గా పోస్టు కార్డుల సైజువి: పదిహేను కార్డులు సంపాదించి నల్లటి ఇండియన్ ఇంకుతో రాసేడు. అతను ఎంత అందంగా రాసేడంటే వాటిమీద సంతకాలు పెట్టడానికి గాని, అడ్రసులు రాయడానికి గాని నాకు చేతులు రాలేదు. నాపేరు, ఆ అడ్రస్‌లు కూడా ఆ చేత్తోనే రాసేమని అతనికే అప్పచెప్పేను. "ప్రతి రాత్రి వసంత రాత్రి" అన్నట్టు ప్రతి కార్డు ఒక కళాఖండంగా తీర్చిదిద్దేడు.

నాలుగో రోజుకల్లా హైదరాబాద్‌లో ఉంటున్న మా తమ్ముడు దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. నాకు మనవడు పుడితే మా తమ్ముడిక్కూడా పుట్టినట్టే కదా; అంచేత సంతోషించి రాసుంటాడు అనుకున్నాను. కాని అలా అవలేదు. "కార్డు కథ" అని టైటిల్ పెట్టి రాసేడు ఆ ఉత్తరం. పోస్ట్‌మేన్, నా శుభలేఖ ఇచ్చినందుకు ఒక రూపాయి వసూలు చేసేడట. తనేమో ఆ కార్డు పుచ్చుకుని జి.పి.ఓ. (అనగా ముఖ్య తపాలా కార్యాలయం) కి వెళ్లి ఎందుకు జరిమానా వేసేరు

అని అడిగాడట. అక్కడ అధికారి ఒకాయన ఆ ఉత్తరాన్ని పరిశీలించి "పోస్ట్‌కార్డు మీద ఏదైనా అచ్చువేస్తే నలభై పైసల పోస్టేజి అంటించాలి లేకపోతే "డ్యూ" రూపాయి వసూలు చేస్తారు." అని చెప్పేడట. "ఇది అచ్చుకాదే - అని చెప్పినా ఆయన వినలేదు, నమ్మలేదు. అదీసంగతి" అని ఆ కథంతా రాసి, సంతకం పెట్టేసి, చివర్న వోమూల-మనవడు పుట్టినందుకు సంతోషం అని గొలికేసేడు. "మీ తమ్ముడికి పాపాయి కంటే రూపాయి ముఖ్యంలా ఉంది. రూపాయి గురించి కార్డంతా రాసేసి చివర్న ఆ ముక్క గొలికాడు, చూసేరా!" అని మా ఆవిడ వేళాకోళం చేసింది.

ఆరో రోజుకి నైనిటాల్ నించి మా చిన్నాన్న గారి సుబ్బారావు రాసిన ఓ ఉత్తరం వొచ్చింది. "ఒరే గోపాలం; నీ పేరు పెట్టి ఎవడో కమర్షియల్ ఆర్టిస్ట్ మనవడు పుట్టేడంటూ ఏమిటేమిటో తేదీలతో సహా రాసేసాడు. వెనక సాయిబాబా ఉత్తరాలూ జై సంతోషిమాత ఉత్తరాలూ చూసేను గాని ఇలాంటి కల్పన కనీ విని ఎరుగను. పోనీలే; ఆ ఉత్తరాల్లో లాగా పదహారు కార్డులు రాయకపోతే నీ కుటుంబం కూలిపోతుంది అని రాయకుండా రూపాయి "డ్యూ"తో వదిలింది. తస్మాత్ జాగ్రత్త. అందరూ కులాసా. నీ క్షేమం వ్రాయి" అనుంది అందులో.

ఆ మర్నాడు ఒక బుక్ పోస్టు పంపవలసి వచ్చింది. విజయవాడలో ఉంటున్న మా ఆవిడ ఫ్రెండ్ ఒకావిడ తను రాసిన కవితల అచ్చు కటింగులు చదివి అభిప్రాయం రాయమని ఎవరికో ఇచ్చి పంపింది. ఆ కవితల సౌందర్యం చూసి ముగ్ధుడనై అవన్నీ మంచి కాగితాల మీద అంటించి చిన్న పుస్తకంలాగ కుట్టి బుక్‌పోస్టులో పంపడానికి వీలుగా తయారుచేసి, చివరి క్షణంలో ఈ పుస్తకం సౌందర్యం చూసి ఎవరైనా ముగ్ధులైపోతే కవితలు పోతాయని "రిజిష్టర్" అని రాసి పోస్టాఫీసుకి పట్టుకెళ్లేను. కౌంటర్‌లో ఆయన "ఇది బుక్‌పోస్టు చెయ్యడానికి వీల్లేదు" అన్నాడు.

"అన్నీ అచ్చు కటింగ్‌లే కదా. ఉత్తరం ఏమీ రాయలేదే" అన్నాను.

"ఐనా సరే వెళ్లదు" అన్నాడాయన.

"దారం ఊడతీసి ప్రయివేటు లెటరు ఉందో లేదో చెక్ చేసి చూసుకోండి, ప్రింటెడ్ మేటర్ బుక్ పోస్టులో పంపొచ్చు" అని వాదించేను.

"నా కంఠంలో ప్రాణం ఉండగా అలా పంపనివ్వను" అని అతను అనలేదు, "నేను డ్యూటీలో ఉండగా అలా పంపనివ్వను" అనే అన్నాడు.

క్యూలో నా వెనకాల నుంచున్న మనిషి "మీరు మహారాజు పేట పోస్టాఫీసుకి వెళ్లండి, అక్కడ తీసుకుంటారు" అన్నాడు.

ఆ తరువాత తెలిసింది. ప్రింటెడ్ మేటర్ బుక్‌పోస్టు ద్వారా పంపాలంటే మహారాజు పేట వెళ్లాలి. వి.పి. పార్సెల్‌లో బిల్లు జతపరిస్తే సింగమ్మధార వెళ్లాలి. రిజిష్టర్ చెయ్యని పార్సెల్ ఉత్తరంగా భావించకుండా (అంటే ప్రతి పదిగ్రాములకీ అరవైపైసలు సమర్పించుకోకుండా) పంపుకోవాలంటే రామలింగనగర్ వెళ్లాలి. ఇన్స్యూర్ చేసిన ఉత్తరమో పార్సెలో పంపాలంటే హలం పేట వెళ్లాలి. ఇలా ఒక్కొక్క రకం ఒక్కొక్క పోస్టాఫీసు ద్వారా పంపితే కొశ్చన్స్ ఆబ్జక్షన్స్ లేకుండా పంపొచ్చు. రూల్స్ ఇండియా అంతా ఒకటే అయినా రూల్స్ తెలిసిన వాళ్లు అక్కడ

ఒకడు ఇక్కడ ఒకడు సద్దుకుని ఉంటారు. సరైన రూలు ఇదీ అని తెలియని ఉద్యోగి ఎలాగో ఒకలాగ మెలిక పెట్టేసి మనచేత ఎక్కువ డబ్బు ఖర్చు పెట్టించేస్తాడు. లేకపోతే ఇలా వీల్లేదు అని చెప్పేస్తాడు.

మొన్న నాలుగో తారీకునాడు నా కథల పుస్తకం ఒకటి వి.పి పార్సిల్‌లో బిల్లు జతపర్చి పంపవలిసొస్తే ఛార్జ్ చూసుకొని సింగమ్మధారకి వెళ్లాను. కౌంటర్‌లో ఉన్న మనిషి నా పుస్తకం వెనక్కిచ్చేసి "ఇందులో ఎన్‌క్లోజర్స్ తీసేండి" అన్నాడు. ఇది వరకటాయన ట్రాన్స్‌ఫర్ అయిపోయినట్టుంది.

"మరి అవి ఎలా వెళతాయి?" అన్నాను.

"అవి వేరే కవర్‌లో వెళ్లాలి, అవి పెర్సనల్ కమ్యునికేషన్‌ల కింద లెక్క"

"బిల్లు పోతే ఇబ్బంది కదా" అన్నాను.

"పోకుండా వెళ్లాలంటే రిజిష్టర్ చెయ్యండి."

"అసలే రిజిష్టర్డ్ పోస్టు ధరలు కందిపప్పు ధరల్లా పెరిగిపోయి వుంటే ఒక్క పుస్తకానికి రెండు రిజిష్టర్డు పోస్టులా? చంపేసేరండి!" అన్నాను. "కందిపప్పు మానేశారా?" అన్నాడతను. లోపల్నించి ఒకాయన "ఏమిటీ, గలాటా!" అంటూ వొచ్చాడు. తీరా చూస్తే నా క్లాస్‌మేటు చంద్రశేఖరం. "ఎన్నాళ్ళకి కనిపించావు! లోపలికి రా." అని పిల్చుకెళ్ళాడు. కొంతసేపు మాట్లాడుకున్నాక బెల్ కొట్టి వి.పి. గుమస్తాని పిల్చి "ఇది తీసుకోండి" అని చెప్పి నన్ను సంతోష పెట్టేడు చంద్రశేఖరం; ఆ బ్రాంచికి పోస్టుమాస్టరు.

రెండు నిమిషాల్లో రసీదు నా దగ్గిరకొచ్చేసింది.

నేను లేచాను. "ఒస్తాన్రామరి" అన్నాను.

"ఇది నీ దగ్గిరుంచు" అని ఒక కాగితం ఇచ్చేడు. అది "పోస్టల్ ఇన్‌ఫర్‌మేషన్" అని హెడ్డింగు పెట్టిన ఒక అచ్చు కాగితం. సరికొత్త రేట్లు, రూల్సు అన్నీ ఉన్నాయి అందులో.

"పూర్వం డయిరీల్లో 'పోస్టల్ ఇన్‌ఫర్‌మేషన్' ప్రింటు చేసేవారు" అన్నాను.

"ఔను. గత నాలుగేళ్లలో ఆరుసార్లు మారింది. అందుకని నీ వంటివారికోసం లేటెస్ట్ సమాచారం నేను వేరే స్వంత ఖర్చులతో వేయించాను." అన్నాడు చంద్రశేఖరం.

"ఓ.కె. థాంక్యూ!" అన్నాను.

"నేను రాసి అచ్చువేయించింది నీకిచ్చేను. నువ్వు రాసి అచ్చు వేసింది నా కొకటి ఇవ్వాలి" అని షేక్ హేండ్, చిరునవ్వు.

అర్థమైంది, నా కథల పుస్తకం కాంప్లిమెంటరీ కాపీ అడుగుతున్నాడు. అమ్మో, అమ్మో! గట్టివాడే. నా పుస్తకం వెల ఇరవై రూపాయలు!

"ఏదిఏమైనా సరే, భారత దేశం మొత్తం మీద లంచం అంటూ పుచ్చుకో(లే)ని డిపార్టుమెంటు పోస్టల్ డిపార్ట్‌మెంట్ ఒక్కటే. అంచేత చంద్రశేఖరం లాంటి వాళ్లకి కాంప్లిమెంటరీ కాపీలిచ్చినా టెలిగ్రాఫ్ మెసెంజర్లకీ పోస్ట్‌మేన్‌లకీ దసరా మామూళ్ళు ఇచ్చినా అదోపెద్ద లెక్కలోది కాదు" అనుకున్నాను; ఇవతలికి వస్తూ. ★